క్లుప్తంగా

బాలకృష్ణ తీరు ఆక్షేపణీయం



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి

రేణిగుంట: దేవాలయం లాంటి అసెంబ్లీలో అన్‌పార్లమెంట్ లాంగ్వేజ్‌ను సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఉపయోగించడం ఆక్షేపణీయమని తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సినీనటుడు చిరంజీవిపై బాలకృష్ణ అనుచితంగా మాట్లాడటం ఎంతమాత్రమూ సరికాదన్నారు. శుక్రవారం రాత్రి రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తిరుపతి ఎంపీ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాలని, విజ్ఞతతో మాట్లాడాలన్నారు. ఒకరిని కించపరిచేలా, తూలనాడటం, నోరు పారేసుకోవడం కాదన్నారు. ఇలాగే కొనసాగితే అసెంబ్లీ, పార్లమెంటు వ్యవస్థలు దిగజారిపోతాయన్నారు. వాస్తవమేమిటో తెలుసు కాబట్టే చిరంజీవి ప్రతిస్పందించారని, మాజీ ముఖ్యమంత్రి ఎవరినీ అసభ్యకరంగా మాట్లాడలేదని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ముక్కంటి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థిపై సీనియర్ల దాడి

నారాయణవనం: ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్ గదిలో ఆరుగురు సీనియర్లు తనపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టి హింసించారని ఓ విద్యార్థి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ విద్యార్థి స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతూ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. అదే కళాశాలకు చెందిన ఓ విద్యార్థినికి మేసేజీలు చేస్తున్నాడని ఆరుగురు సీనియర్ విద్యార్థులు 20వ తేదీ శనివారం రాత్రి తమ గదికి రప్పించి చితకబాదారు. జరిగిన సంఘటనకు విచారిస్తున్నామని చెప్పడానికి మరుసటి రోజు మరోసారి గదికి పిలిపించి దాడిచేశారు. ఈ సంఘటనను విద్యార్థి తల్లికి చెప్పడంతో అతనికి చికిత్స చేయించి, గురువారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దాడికి పాల్పడిన ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



బాలాజి (ఫైల్)

నాగలాపురం: నాగలాపురం మండలం చిన్నాపట్టు గ్రామంలో గురువారం సాయంత్రం కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బైటకొడియంబేడు వద్ద తిరుపతి –చెన్నై జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో వెల్లూరు గ్రామానికి చెందిన బాలాజి (27) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి అదేరోజు రాత్రి 12 గంటలకు మృతి చెందినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య గర్భవతి అని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



రేణిగుంట: స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సీజ్ చేసి తమ కార్యాలయానికి తరలించారు. ఎలాంటి అనుమతులు పొందకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మాంబేడు వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

వెదురుకుప్పం: విధుల్లో నిర్లక్ష్యం, సమస్యల పరిష్కారంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఓ వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి.వెంకటసుబ్రమణ్యం గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించకపోవడంతో గతంలో స్థానికుల నుంచి అధికారులకు అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పందించిన నగరి ఏఎస్‌డబ్ల్యూఓ, వెదురుకుప్పం ఎంపీడీఓ సచివాలయంలో విచారణ చేపట్టారు. అధికారుల చేపట్టిన విచారణలో వెంకటసుబ్రమణ్యం సకాలంలో విధులకు హాజరు కావడం లేదని, కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గుర్తించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారితో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో గతంలో అధికారులు హెచ్చరించినా వారి ఆదేశాలను భేఖాతరు చేయడంతోపాటు తీరుమారలేదు. ఈ క్రమంలో గత నెలలో నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకట సుబ్రమణ్యంను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగమణి శుక్రవారం తెలిపారు.

అడ్డుకుంటే అంతు చూస్తారట..!



ప్రహరీ గోడ కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం



రోడ్డు మలుపు వద్ద అడ్డంగా ఉన్న నిర్మాణం

- దర్జాగా రోడ్డు పక్కన స్థలం ఆక్రమణ
- స్థలం తమదంటూ ఆర్‌అండ్‌బీ అధికారులకు బెదిరింపు!

రేణిగుంట: రేణిగుంట–పాపానాయుడుపేట రహదారిలోని యోగానంద కాలేజి సమీపంలోని మలుపు వద్ద తారు రోడ్డుకు ఆనుకుని కొందరు ప్రహరీ గోడ నిర్మాణానికి పూనుకున్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రహరీ గోడ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. సర్వే చేసి, ఈ స్థలమెవరిదో తేల్చే వరకు పనులు చేయరాదని హెచ్చరించారు. అయితే అధికారుల మాటల్ని బేఖాతరు చేస్తూ శుక్రవారం మళ్లీ గోడ నిర్మాణ పనులు మొదలెట్టారు. పైగా, తమది రిజిస్ట్రేషన్ భూమి అని, పనులు అడ్డుకుంటే అంతు చూస్తామంటూ ఆర్‌అండ్‌బీ సిబ్బందిని ప్రైవేట్ వ్యక్తులు బెదిరించడం గమనార్హం. దీనిని సీరియస్‌గా తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్టు వర్క్ ఇన్‌స్పెక్టర్ మురుగయ్యనాయుడు తెలిపారు. ప్రహరీ గోడ నిర్మిస్తే మలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దీనిని అడ్డుకోవాలని స్థానికులు కోరారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



కనకాచలం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: కనకాచలంపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ కనకదుర్గమ్మను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మున్నా రాయల్, జై శ్యామ్ రాయల్, శ్రీవారి సురేష్, మోగరాల గణేష్, కాణిపాకం సురేష్, యశ్వంత్ రెడ్డి, కుమార్, మణి, రవి, సతీష్, సూర్య, బాబి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల మేరకే ఖర్చు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణినాయుడు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పనులు చేయకుండానే బిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. వాటికి 15వ ఆర్థిక సంఘం నిధుల్లో చెల్లింపులు చేయాలని అధికారులు చూస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు అవసరమైన పనులకు మాత్రమే ఆ నిధులను ఖర్చు చేయాలన్నారు. నిధులు దుర్వినియోగమైతే ఊరుకునేది లేదని, ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నేత తల్లికి నివాళి



ముత్తమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని వేంబాక్కం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శివ తల్లి ముత్తమ్మ (72) గురువారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ వేంబాక్కం హరిజనవాడలోని శివ ఇంటికి చేరుకున్నారు. ముత్తమ్మ భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు చిన్నదొరై సుధా, శ్యామ్, దేశప్పన్, రాజ, అలగేశన్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు అందుబాటులో వైద్యం



వైద్య శిబిరంలో వైద్యులు, సిబ్బంది

రేణిగుంట: మండలంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల వల్ల గ్రామీణులకు వైద్యసేవలు అందుబాటులో వచ్చాయని వైద్యాధికారి చక్రపాణిరెడ్డి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సూరప్పకశం, వెంకటాపురం పంచాయతీలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తిరుపతి రుయా హాస్పిటల్‌కు చెందిన చిన్నపిల్లలు, గర్భవతులు, కంటి, చర్మ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు అనూరాధ, కామరాజు, సుమశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకుడు శివారెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు యతేంద్రరెడ్డి, మునివేలు, జడపల్లి ఆనంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు నిలిపేసిన డిజిటల్ అసిస్టెంట్



సచివాలయంలో 11 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నాగలాపురం: మండలంలోని నాగలాపురం సచివాలయం–3లో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ సేవలను నిలిపేశాడు. ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ వెనక్కి పంపుతున్నాడు. ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతను అధికారులు కడివేడు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ మాలిక్‌కు అప్పగించారు. అతను వివిధ సేవల కోసం వచ్చే ప్రజల నుంచి దరఖాస్తు ఫారానికి రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నాడు. ఈ విషయం గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11 గంటలైనా ఆధార్ కేంద్రం సేవలు ప్రారంభం కాలేదు. తర్వాత ఎప్పుడో తీరిగ్గా వచ్చిన డిజిటల్ అసిస్టెంట్ ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. జంబుకేశవపురం గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన ఒక మహిళ, వారి పిల్లలకు ఇక్కడ ఆధార్ సేవలు చేసేది లేదని తెగేసి చెప్పాడు. అలాగే ఇతరులకు సర్వర్ పనిచేయడం లేదని చెప్పి పంపించేశాడు. ఈ విషయాన్ని మండల పరిషత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు..'రన్ శ్రీకాళహస్తి రన్'

శ్రీకాళహస్తి: ఈ నెల 29వ తేదీ ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి వద్ద ఆదివారం ఉదయం 8 గంటలకు రన్ శ్రీకాళహస్తి రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు ఈ రన్ సాగుతుందన్నారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని, ఆసక్తి కలిగిన వారు 72888 77300, 7288 877308 నంబర్లను సంప్రదించాలన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మెప్మా పీడీ ఎప్రాయిం

పుత్తూరు: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లోక్ కల్యాణ్ మేళా కార్యక్రమం ద్వారా పొందుతున్న రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ జె.ఎప్రాయిం కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎప్రాయిం మాట్లాడుతూ పీఎం స్వనిధి 2.0లో భాగంగా తొలి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు వంతున రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పుత్తూరులో మొత్తం 1474 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందివ్వడానికి తగిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ మంజునాథ్‌గౌడ్, బ్యాంకు మేనేజర్లు, వైద్య సిబ్బంది, మెప్మా టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ సునీత, ఆర్గనైజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తొట్టంబేడు: చెన్నై రోడ్డులోని వినాయకనగర్‌లో దొంగలు పడ్డారు. తాళం వేసిన ఇంట్లో చోరీ చేశారు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. 2వ పట్టణ ఎస్‌ఐ పార్థసారథి కథనం..రామచంద్రారెడ్డి, గౌరి అనే వృద్ధ దంపతులు వినాయనగర్‌లో కాపురం ఉంటున్నారు. బుధవారం కంటి చికిత్స నిమిత్తం తిరుపతికి వెళ్లి గురువారం తిరిగి వచ్చేసరికి దొంగలు పడినట్లు గుర్తించారు. ఫిర్యాదు చేయడంతో శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. బీరువాలోని 24గ్రాముల బంగారం, రూ.10వేలు నగదు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడిక తీయరు.. మురుగు కదలదు



వరదయ్యపాళెం హైస్కూల్ వద్ద కాలువలో కదలని మురుగునీరు



వరదయ్యపాళెం హైస్కూల్ ఎదురుగా పిచ్చిమొక్కలతో పూడిపోయిన మురుగునీటి కాలువ

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయి. హైస్కూల్ ఎదురుగా ఉన్న కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. పగలే దోమలు స్వైర విహారం చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. రాత్రిళ్లు కంటిమీద కునుకు ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాలువల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జానపద కళలను పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న గంగలపూడి గిరిధర్‌రెడ్డి

ఏర్పేడు: భారతీయ వారసత్వ సాంస్కృతిక సంపదకు కళలు తార్కాణమని చిందేపల్లి సిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లెలో శుక్రవారం రాత్రి గజ్జె పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు కొన్ని రోజులుగా కోలాటం, భజన శిక్షణ పొందారు. శిక్షణ ముగింపు సందర్భంగా రుక్మిణీ సమేత పాండురంగ స్వామికి పూజలు చేశారు. గంగలపూడి గిరిధర్ రెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భజన బృందానికి రూ.25వేల విరాళం అందజేసి ఆయన మాట్లాడారు. జానపద కళలు అంతరించిపోతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇలాంటి కోలాట ప్రదర్శనలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఆయన కోరారు.

జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్ల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ: రెండేళ్లుగా జీతాలు ఇవ్వకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వెస్టువరత్తూరు పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు వాపోయారు. వారు శుక్రవారం జీతాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జీవో నంబర్ 680 విడుదల చేసి 20 నెలలు గడిసినా అధికారులు అమలుచేయడం లేదన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పారిశుద్ధ్య పనులు చేశామని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేల జీతం ఇవ్వాలని, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు, యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో మోతికి వినతి పత్రం అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో మోతి తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాల అభివృద్ధికి సున్నా వడ్డీ రుణాలు, తక్కువగా వడ్డీకి స్త్రీనిధి రుణాలు ఇస్తోందన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి, పరపతి పెంచుకోవాలని సూచించారు. రుణాల చెల్లింపులో వెనుకబడిన గ్రూపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎం మునెయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలత్తూరు రోడ్డును బాగు చేయాలని వినతి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీకి వెళ్లే ఆలత్తూరు రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరారు. ఎంపీడీవో మోతి శుక్రవారం ఆలత్తూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆలత్తూరు రోడ్డు వెంబడి క్రషర్లు, క్వారీలు ఉన్నాయని తెలిపారు. వాటి నుంచి ప్రతి రోజూ లారీల్లో 50 టన్నులకు పైగా బరువున్న బండలను తరలిస్తుంటారని తెలిపారు. దీంతో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారిందని వాపోయారు. వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు సరిగా లేదని ఆర్‌టీసీ బస్సులను నిలిపేశారని తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎంపీడీవో మోతి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అమ్మవారికి గొడుగుల సమర్పణ

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారికి చెన్నైకి చెందిన భక్త బృందం రెండు గొడుగులను సమర్పించింది. హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ వారు శుక్రవారం రాత్రి ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్‌కు రెండు గొడుగులను అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు గోపాల్ జీ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

5న కనకదాసు విగ్రహావిష్కరణ

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో అక్టోబర్ 5వ తేదీన భక్త కనకదాసు విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు విగ్రహ కమిటీ కో–కన్వీనర్లు ఎం.రెడ్డెప్ప, కేవీ రమణ తెలిపారు. శుక్రవారం ఈమేరకు సభా ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలించారు. విగ్రహావిష్కరణ రోజున బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కమిటీ ప్రతినిధులు ఏ.రవీంద్ర, మల్లి, పీవీ శంకరయ్య, నాగసుబ్బయ్య, రామాంజనేయులు, హరనాథ్, రమేష్, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

చేనేత, హస్తకళ మేళా ప్రారంభం

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని ఉపాధ్యాయనగర్‌లో తిరుపతి ఎలైట్ సోషియల్, కల్చరల్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళ మేళాను సొసైటీ కార్యదర్శి మహేష్‌పైడి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ మేళాలలో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది కళాకారులు తమ ఉత్పత్తులను సరసమైన ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 10వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా ఉంటుందని వివరించారు.

పాహిమాం మాతా.. పాహిమాం









అశ్వాసుర వధ అవతారంలో జ్ఞానప్రసూనాంబ, శ్రీకాళహస్తి: గాయత్రిదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి, సత్యవేడు: శ్రీమహాలక్ష్మీదేవిగా సర్వమంగళాదేవి, మహాలక్ష్మిగా మరకదాంబిక

శ్రీకాళహస్తి: పాహిమాం మాతా పాహిమాం .. అంటూ భక్తులు అమ్మవారిని మొక్కారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో 5వ రోజు శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అశ్వాసుర వధ అవతారంలో భక్తులను కటాక్షించారు. అమ్మవారికి విశేష పూజల అనంతరం ఆలయంలోని రంగుల గోపురం వరకు ఊరేగించారు. ఇక, ఆలయంలోని బొమ్మల కొలువులో అమ్మవారు స్కంధమాతగా, కనకదుర్గమ్మ లలితాదేవిగా, కనకాచలంపై కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకారంలో కొలువుదీరారు. బజారువీధిలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి గాయత్రిదేవిగా, ఏడుగంగలమ్మ స్కంధమాతగా, ముత్యాలమ్మ, నల్లగంగమ్మ, భాస్కరపేట చాముండేశ్వరిదేవి, బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పొన్నాలమ్మ మహాలక్ష్మిగా, బహదూరుపేటలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి శ్రీరంగం రంగనాయకదేవి అలంకరణలో, అలాగే పలు ప్రాంతాల్లోని అమ్మవార్లు ప్రత్యేక రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ధనలక్ష్మీదేవి అలంకరణలో చెంగాళపరమేశ్వరి

వరదయ్యపాళెం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరదయ్యపాళెంలోని చెంగాళపరమేశ్వరి, అంబూరులో వున్న కామాక్షమ్మ అమ్మవార్లు ధనలక్ష్మీదేవిగా భక్తులను అనుగ్రహించారు.

శ్రీమహాలక్ష్మిగా మరకదాంబిక

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన సర్వమంగళా సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మరకదాంబిక అమ్మవారికి శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో పి.లత, ఆలయ సిబ్బంది పరంధామరెడ్డి, శరవణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీమహాలక్ష్మిగా ఉమామహేశ్వరి

సత్యవేడు: శ్రీ ఉమామహేశ్వరి దేవిని శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చింది. ఇరుగుళంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రులు సందర్భంగా శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ వి. ప్రతిమ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

శ్రీమహాలక్ష్మిగా సర్వమంగళాదేవి

సత్యవేడు: సత్యవేడులో వెలసిన సర్వమంగళాదేవి అమ్మవారు శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు రూ.10 లక్షల కరెన్సీతో అమ్మవారిని అలంకరించారు. అలాగే ఇరుగుళంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

కామాక్షిగా అవనాక్షమ్మ

నారాయణవనం: మండలంలోని సముదాయంలోవున్న టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం కంచి కామాక్షిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కైలాసనాథ కోనలో వెలసిన కామాక్షాంబిక అమ్మవారు, తిరువట్యంలో వున్న మూలస్థాన ఎల్లమ్మ గాయత్రీదేవిగా భక్తులను అనుగ్రహించారు. ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని కరిమారియమ్మగా అలంకరించారు.